# పడిపోయిన సిపాయి

క్రంకిపాటి కామాయికి ఇన్ఫెన్ట్రీలో యిచ్చిన పేరు ప్రయివేటు సిపాయి నంబరు 68310 అని.

ఆ చుట్టుగోడలో వున్న కంతలోంచి దూరి ఇవతల పడ్డాడు. బోర్ల నుంచి వెల్లకిల తిరిగాడు. ఆ వెధవ మణిపూరు రోడ్డు - కొండలూ, గుట్టలూ పైగా ఎనిమీ కట్టే అడ్డుగోడలూ!

సూర్యుని కిరణాలు కామాయి బుగ్గలమీద తాండవిస్తుంటే ఆ చలి కాలంలో వాడికి హాయిగా వున్నది. వాడనుకోవడం- ఆ గోడ కంతలోంచి దూరి హాయిగా ఇవతల పడ్డానని.

ఆఁ! యేడిసినట్టుంది. గౌహటీనుంచి బయల్దేరి నవుగాం కొచ్చాం. ఆడనుంచి మనిపూరెళుతుండాం. నా కాలి కేదో తగిలి నే నీడ పడ్డాను. యారయినా యింటే నవ్వుతారు. లేసి మిగతావోళ్ళను కలుసుకోవాలి. ఆళ్ళీ పాటి కవతల కొండమీదికి పోయుంటారు అనుకున్నాడు కామాయి.

చేతులూ కాళ్లూ కదలడంలేదు. లేవాలని ఎంతో ప్రయత్నించాడు. దుఢీలున మహా భయం వేసింది వాడికి. సూర్యకిరణా లాగిపోయా

యన్నట్లుగా వాడి శరీరమంతా చల్లబడడ మారంభింపేసరికి వాడికి మహా గాభరా వేసింది.

"అరే దేముడా! ఓ యాల నేనూ....ఓ యాల నేనూ; కాదు కాదు" అని మళ్ళీ శాంతపడ్డాడు. "ఆ పడడంలో యెక్కడో బెణికింది కామోసు, అందుకనే లేవలేక పోతుందా" అనుకున్నాడు.

కొంచెం సేపటికి వాడి శరీరంలో వున్న చల్లదనం పోయింది. సూర్యకిరణాల వేడిమికి మళ్ళీ హాయి పొందుతున్నాడు కామాయి.

అదంతా అసలు సి. ఓ. తప్పు. లేకపోతే యేమిటి మరి? వాళ్ళందర్నీ సెలవు కిండ్లకు పంపిస్తా నన్నాడు. వారం రోజులైనా కాలేదు, ఏక్షన్‌లోకి పోవాలన్నాడు. ఇండ్లమీద ప్రాణాలు పెట్టుకున్నవాళ్ళు ఎట్లా ఆ వెధవ మణిపూరు రోడ్డుమీద బార్బుడు వైరు వెనక పాకులాడుతూ పోతారు? ఆ పనిమీద మనస్సెలా వుంటుంది? న్యాయం కాదు.

ఆ మొదటి కొండ ప్రక్కనుంచి ఆ గ్రామంగుండా గోడల సందుల్లో బోర్లపడి పాకులాడుతూ పోయినప్పుడంత కష్టంగా లేదు. అప్పుడు ముందర బోడిరాము డుండేవాడు. వాడి తలకాయ చూసుకుంటూ పాకాడు కామాయి. పాపం చాలా మంచివాడు బోడిరాముడు. ఎన్ని బాంబులు పడుతున్నా వాడి యాసలో వాడు ఏవేవో చమత్కారా లాడుతూ ఆ వున్నవాళ్ళ ధైర్యం పోకుండా చూచేవాడు.

అదైపోయింది. అసలు నాటకం-లేచి ఆ చుట్టూ గోడ ప్రక్కనుంచి పాకులాడుతూ పోవాలని ఆర్డ రొచ్చింది. కామాయి వెంటనే ఎదుట చూడంగానే గోడలో మనిషి దూరేంత కంత వుంది. మహా అదృష్టవంతు డ్ననుకున్నాడు. దూరి అవతలకుపోతే ఫస్టు అనుకున్నాడు. అక్కడ్నుంచీ పాకటం ఉండదనుకున్నాడు. వాడి కోసమే ప్రత్యేకం, ఆ కంత వుందను కున్నాడు. దభాలున దూకాడు. అయితే కాళ్ళమీద లేవాల్సింది మొఖం బోర్లాపడ్డాడు - ఆ యెత్తునుంచి!

ఆశ్చర్యం కూడాను! ఆ దూకబోయే ముందర ఓసారి చుట్టూ చూచాడు. కంకిపాటి చెరువల్లే ఓ చెరువూ, అక్కడ మోస్తరే ఓ వరిపొలం కనబడ్డాయి. ఆశ్చర్యం సుమా! ప్రపంచంలో రెండుచోట్ల ఒకే మాది రుండడం.

ఎన్నిసార్లో కామాయీ, తల్లీ, చిన్న తమ్ముడూ ఆ చెరువొడ్డున కూర్చుని వణ్ణం తిన్నారు. అదంతా జ్ఞాపక మొచ్చింది. వాళ్ళమ్మా, తమ్ముడూ, వణ్ణమూ, మెరపకాయల కారమూ, కాల్చిన రొయ్యలూ అన్నీ జ్ఞాపక మొచ్చాయి. పాపం ఎన్నిసార్లు వాళ్ళమ్మ ఎండలో ఆ పొలంలో చమటలు కమ్ముతూ పనిచేయలేదు? నిజం - అదంతా కళ్ళకు కట్టినట్లు కనబడ్డది వాడికి - ఆ గొంతుకలు గూడా వినబడ్డాయి.

నిజంగా ఆ గొంతుకలు వినబడ్డాయి. తమ్ముడు చెట్టెక్కాడు. "రేయి నీ జిమ్మతియ్యా! ఆ వున్న ఒక్క గంతా సింపుకుంటావు, దిగి రాయేంరా!" అనేది అమ్మ. కామాయి చెర్లో చాపలు పడుతుంటే "రాయేంరా! ఈ మట్టి తియ్యాలి రారా!" అనేది.

వాళ్ళు ముగ్గురే! ఆ గ్రామంలో ఇంకా వున్నారుగాని వీళ్ళ ముగ్గురికీ వీళ్ళ ముగ్గురే అన్నట్లుండేది.

అప్పుడే - అప్పుడే సుబ్బిని కలిశాడు కామాయి. సుబ్బిని కలిసిం తర్వాత మారాడు. అప్పట్నుంచీ అమ్మా కాదు, తమ్ముడూ కాదు- ప్రపంచ మంతా సుబ్బే! సుబ్బి ఇప్పుడుంటే ఎంతిచ్చుకోడు? ఆ నున్నగా నల్లగా చంపలమీ దానిస్తే యేమివ్వడు? పక్కన పడుకుంటే చాలు—ఆ గుండెలో వేస్తున్న నొప్పంతా పోతుంది. ఆ గుండెలో నొప్పి, మొఖంమీద మంట వాణ్ని ముందుకు లాక్కెళ్ళుతున్నాయి - సుబ్బిని కలుసుకోడానికి.

అవును సి. ఓ. లీవిస్తానన్నాడు. వెళ్ళి సుబ్బిని పెండ్లాడవచ్చు. సుబ్బి పెండ్లాడుతుందా? కంకిపాటి సుబ్బి అవుతుందా? అయితే ఆ పొలం

పక్కన, ఆ చెరువొడ్డున ఆ వేపచెట్టు మధ్యనున్న గడ్డివామి పక్కన పడుకున్నప్పు డాడిన మాటలు మాటాడుతుందా?

మళ్ళీ వొకసారి లేవటానికి ప్రయత్నించాడు కామాయి. ఉహుఁ! ఏ అవయవమూ కదల్దే!

పోనీలే. కదలకపోతే నేమాయె. ఇప్పుడు కదిత్తేనేం, కదలక పోతేనేం. అంతా అయిపోయినట్లుంది. ఏమిటా చీకటి? గ్రహణం పట్టిందా? గ్రహణంలో కదలకూడనివాళ్ళు గర్భిణీ స్త్రీలు తాను సిపాయి. ఎందుకు కదలకూడదూ?

మూతి బిగించి లేవబోయాడు. కదలలా! వాడికే నవ్వొచ్చింది. మెడ ఓ వైపు తిప్పాడు. ఆ చెరువు వొంక చూశాడు—నవ్వుతూ.

శవాలను వెతుక్కుంటూ గాయపడ్డ వాళ్ళను మోసుకెళ్ళే పార్టీ ఒక టక్కడికి వచ్చింది. వాళ్ళ లీడరు అటూ యిటూ చూసి కామాయిని కని పెట్టాడు. దగ్గరకు పోయాడు. చచ్చి చాలా సేపయిందనుకున్నాడు. ముఖం చూచాడు. ఆ వేపు చెరువును చూత్తున్నట్లుగా వుంది. పెదిమలమీద చిరునవ్వుంది.

లీడరు కామాయి బ్లవుసు విప్పాడు. మెళ్ళోవున్న రెండు ఐడెంటిటీ డిస్కులు చూచాడు. చదివాడు. కంకిపాటి కామాయి-నంబరు 58810 అని వుంది. ఎదురుగా కొండవేపు చూశాడు. కామాయి పుర్రెలో వున్న గుండు దెబ్బ సూశాడు.

"ఈడీ కంతలోంచి యీతలికి సూసేసరి కాదెబ్బ తగిలుంటుందిరా ఇంటికి ఐడెంటిటీ తీస్కోండి.... ఆ తర్వాత ఏదైనా వస్తుంది!" అని తక్కిన వాళ్ళతో అన్నాడు.

శవం నక్కల పాలయింది.

●